జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీపీ అంబర్ కిశోర్‌ఝా

భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దు

- విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి
- తల్లిదండ్రుల కలలను నిజం చేయాలి
- ఎవరైనా గంజాయి అమ్మితే పోలీసులకు సమాచారం ఇవ్వాలి
- వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా

ఖిలావరంగల్, జూలై 15: గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసై విద్యార్థులు భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై మామూనూరు పోలీసుల అధ్వర్యంలో బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీపీ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల నేడు యువత భవిష్యత్ ప్రమాదంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం క్షణికానందం కోసం మత్తు పదార్థాలను సేవించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించలేరన్నారు. తద్వారా లక్ష్యం ఓ కలగానే మిగిలి పోతుందని వివరించారు. కొంత మంది వ్యక్తులు డబ్బు సంపాదన కోసం గంజాయి వంటి మత్తు పదార్థాలను యువతకు విక్రయిస్తున్నారని తెలిపారు. అలాంటి స్వార్థపరుల చేతుల్లో యువత బలికావొద్దని కోరారు. తల్లిదండ్రుల ఆశలు, కుటుంబ గౌరవాన్ని దృష్టిలో పెట్టుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. తోటి మిత్రులు గంజాయిని తాగితే నష్టాలపై వారికి అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు సేవిస్తున్నా, రవాణా, విక్రయాలు చేస్తున్నా 8712584473 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సదస్సులో ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ తిరుపతి, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డి, సీఐలు రవి, పులి రమేశ్, వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ ఎస్డీ ముస్తాక్ అహ్మద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపతి, ఎస్సైలు శ్రీకాంత్, సురేశ్ పాల్గొన్నారు.

కాశీబుగ్గ: సమావేశంలో మాట్లాడుతున్న హైమావతి, రాయపర్తి: మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు

ప్రాథమిక విద్యను ప్రోత్సహించాలి

- మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ సెంటర్లలో చేర్పించాలి
- జిల్లా సంక్షేమ అధికారి హైమావతి
- వాడవాడలా అమ్మ మాట అంగన్‌వాడీ బాట

కాశీబుగ్గ, జూలై 15: అంగన్‌వాడీ సెంటర్లలో ప్రాథమిక విద్యను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని జిల్లా సంక్షేమ అధికారి హైమావతి అన్నారు. గ్రేటర్ వరంగల్ 3, 21, 23వ డివిజన్లలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీలు తీశారు. అనంతరం 3వ డివిజన్ పరిధిలోని 14 అంగన్‌వాడీ సెంటర్ల నిర్వాహకులతో ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. మూడేళ్లు నిండిని పిల్లలను విధిగా అంగన్‌వాడీ సెంటర్లలో చేర్పించాలని హైమవతి తల్లిదండ్రులను కోరారు. ఈ కేంద్రాల్లో ప్రాథమిక విద్యనభ్యసించే పిల్లల సంఖ్యను మరింత పెంచాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జె.లావణ్య, ఎం.వెంకటేశ్వరి, భాగ్యమ్మ, అంగన్‌వాడీ టీచర్లు రాజేశ్వరి, జ్యోత్స్న, మంజులారాణి, సుజాత, రాణి, భాగ్యలక్ష్మి, ఎలీషా, ఇష్రత్, నాగమణి, ఆశ కార్యకర్తలు మమత, పరిమల పాల్గొన్నారు.

కరీమాబాద్: మొక్క నాటుతున్న కార్పొరేటర్ పల్లం పద్మ, సిబ్బంది

అంగన్‌వాడీ సేవలను వినియోగించాలి

రాయపర్తి: ప్రజలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న సేవలను వినియోగించుకోవాలని ఐసీడీఎస్ వర్ధన్నపేట సీడీపీవో డెబోరా అన్నారు. మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సత్యవతి, పీహెచ్‌సీ వైద్యురాలు ఐశ్వర్య, హెచ్ఎం గారె కృష్ణమూర్తి, అంగన్‌వాడీ టీచర్లు అయిత కృష్ణవేణి, వీద చంద్రకళ, అయిత విజయరాణి, ఆకారపు శశిరేఖ, గారె కవిత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీలు..

కరీమాబాద్/నర్సంపేట: గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలని కార్పొరేటర్ పల్లం పద్మ అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి ఆధ్వర్యంలో వరంగల్ 32వ డివిజన్‌లో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లం పద్మ మాట్లాడుతూ పిల్లలను అంగన్‌వాడీ సెంట ర్లలో చేర్పించాలని కోరారు. అర్హులు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని వియోగించుకోవాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అలాగే, నర్సంపేట రాంనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బానాల ఇందిర మాట్లాడుతూ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం శోభ, అంగన్‌వాడీ టీచర్లు బత్తిని శిరీష, నల్లా భారతి, ఎండీ గౌసియా, ఉపాధ్యాయులు రవీందర్, వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం సునీత పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న రేవంత్ సర్కార్

బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, జూలై 15: రైతు రుణమాఫీపై రేవంత్‌రెడ్డి సర్కారు విడుదల చేసిన మార్గదర్శకాలు రైతులను మోసం చేసేలా ఉన్నాయని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సోమవారం రాత్రి ఒక ప్రకటనలో విమర్శించారు. గైడ్‌లైన్స్ పూర్తిగా రైతులకు వ్యతిరేకంగా ఉన్నాయని పేర్కొన్నారు. రేషన్‌కార్డు లేని వారు వ్యవసాయ రుణం పొందితే వారు అర్హులు కారా అని ప్రశ్నించారు. రూ. 2 లక్షల కంటే ఎక్కువ రణం తీసుకుంటే.. మిగిలిన రుణం చెల్లిస్తేనే రూ. 2 లక్షలు మాఫీ అవుతుందనడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారం 40 శాతం రైతులకు కూడా రుణమాఫీ వర్తించే అవకాశం లేదన్నారు. 60 శాతం మందిని మోసం చేసినట్లేనని ఎద్దేవా చేశారు. ఏ బ్యాంకులో రుణం తీసుకున్నా రూ. 2 లక్షల వరకు బేషరతుగా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులు రోడ్డుపైకి వచ్చే పరిస్థితి తెచ్చుకోకుండా వెంటనే ఈ గైడ్‌లైన్స్‌ను రద్దు చేయాలని పెద్ది డిమాండ్ చేశారు.

బల్దియాలో బదిలీల ప్రక్రియ షురూ

వరంగల్, జూలై 15: బల్దియా ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. రెండేళ్లుగా ఒకే చోట పని చేస్తున్న ఉద్యోగులను బదిలీలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో కసరత్తు మొదలు పెట్టారు. రెండేళ్లు సర్వీస్ నిండిన ఉద్యోగులు ఇప్పటికే బదిలీలపై ఆప్షన్స్ ఇచ్చారు. వారికి సోమవారం మున్సిపల్ ఆర్డీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇచ్చిన ఆప్షన్ ప్రకారం బదిలీకి అంగీకారం తెలుపుతున్నట్లు సంతకాలు తీసుకున్నారు. తొలి రోజు కౌన్సెలింగ్‌కు సీనియర్ అసిస్టెంట్లు, హెల్త్ అసిస్టెంట్లు హాజరయ్యారు. కౌన్సెలింగ్ పూర్తయిన ఉద్యోగుల జాబితాను సీడీఎంఏ కార్యాలయానికి పంపించనున్నారు. మరో నాలుగైదు రోజుల్లో 21 మంది సీనియర్ అసిస్టెంట్లు, 18 మంది హెల్త్ అసిస్టెంట్ల బదిలీ ఉత్తర్వులు వెలువడనున్నాయి. వీరితో పాటు శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేనేజర్లుకు సంబంధించిన కౌన్సెలింగ్ ఈ నెల 18న హైదరాబాద్ సీడీఎంఏ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఇంజినీంగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగాలకు చెందిన అధికారులు బదిలీలకు సంబంధించిన ఆప్షన్లు ఇచ్చారు. ఈ నెలాఖరు వరకు బల్దియాలోని అన్ని విభాగాల్లో ఉద్యోగుల బదిలీలు జరుగనున్నాయి.

జగన్నాథ రథయాత్రలో భక్తజనం

శోభాయమానంగా రథయాత్ర

వరంగల్, జూలై 15: ఇస్కాన్ ఆధ్వర్యంలో వరంగల్ నగరంలో సోమవారం జగన్నాథ రథయాత్ర శోభాయమానంగా సాగింది. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ వద్ద ప్రారంభమైనా రథయాత్ర అశోక జంక్షన్, హనుమకొండ చౌరస్తా, అలంకార్ జంక్షన్, ములుగురోడ్డు, కేఎంసీ, ఎంజీఎం, పోచమ్మమైదాన్ జంక్షన్ల మీదుగా తిరిగి వేంకటేశ్వర గార్డెన్ వరకు కనులపండువగా సాగింది. భక్తులు వేలాదిగా తరలివచ్చి జగన్నాథ రథయ్రాత్రలో పాల్గొన్నారు. రథయాత్ర బండిని లాగుతూ భక్తులు తరించిపోయారు. రోడ్లన్నీ హరేకృష్ణ నామస్మరణ, సంకీర్తనలతో మార్మోగాయి. కార్యక్రమంలో సుఖ్‌దేవ్ గురుస్వామి మహారాజ్, వరంగల్ ఇస్కాన్ టెంపుల్ జిల్లా అధ్యక్షుడు షడ్భుజంగా ప్రభు, మాజీ అధ్యక్షుడు మురళీవర్ధన్, హరికృష్ణ నందదాస్, రవి ప్రభు, భూ పవన హరినామాదాస్, జక్పాల్, కిశోర్‌దాస్, ధర్మేంద్రదాస్, విజయ్‌ప్రభు, మురళీకృష్ణ ప్రభు, లక్ష్మణ్‌ప్రభు, సౌరవ్ ప్రభు పాల్గొన్నారు.

దుకాణాదారులకు అవగాహన

పర్వతగిరి, జూలై 15: మండలకేంద్రంలో అంగడి వద్ద రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నది. సోమవారం గ్రామ పంచాయతీ సిబ్బంది రోడ్డుపై దుకాణాలు పెట్టొద్దని ప్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు దుకాణాదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీపీ సిబ్బంది కరుణాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైలు కిందపడి డ్రైవర్ ఆత్మహత్య

ఖిలావరంగల్, జూలై 15: రైలు కిందపడి లారీ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం ఖమ్మం రోడ్డులోని ఆర్వోబీ సమీపంలో జరిగింది. వరంగల్ జీఆర్పీ సీఐ జీ నరేశ్ కథనం ప్రకారం.. వరంగల్ బీఆర్‌నగర్‌కు చెందిన రుద్ర శ్రీనివాస్(42) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలంగా పని మానేసి మద్యానికి బానిసై భార్యాపిల్లలను వదిలేసి ఒంటరిగా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన అతడు ఖమ్మం ప్రధాన రహదారిలోని ఆర్వోబీ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ వెల్లడించారు.

ఏబీవీపీ ప్రాంత కార్య సమితి సభ్యుడిగా సంగెం సంహిత్‌రెడ్డి

కాశీబుగ్గ, జూలై 15: అఖిల భారత విద్యార్థి పరిషత్ తెలంగాణ ప్రాంత సమావేశం హైదరాబాద్‌లోని స్ఫూర్తి చాత్రశక్తి భవన్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ ప్రాంత కార్య సమితి (రాష్ట్ర వర్కింగ్ కమిటీ) సభ్యుడిగా సంగెం సంహిత్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సంహిత్‌రెడ్డి చెప్పారు.

రేలకుంటలో వివాహిత అదృశ్యం

రాధ(ఫైల్)

నల్లబెల్లి, జూలై 5: కూరగాయల వ్యాపారం చేస్తున్న వివాహిత అదృశ్యమైన ఘటన రేలకుంటలో జరిగింది. గ్రామానికి చెందిన కొల్లూరు రాధ వరంగల్ మార్కెట్ నుంచి కూరగాయలు తీసుకొచ్చి గ్రామంలో విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నది. గత నెల 28న సాయంత్రం 6.30 గంటలకు కూరగాయలు తీసుకొచ్చేందుకు వరంగల్ మార్కెట్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పింది. రాధ తిరిగి రాకపోవడంతో భర్త పోశయ్య, కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె భర్త సోమవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్‌బాబు తెలిపారు.

వ్యవసాయ రంగంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

- ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలి
- వ్యవసాయాన్ని ఉపాధిహామీ పథకానికి అనుసంధానం చేయాలి
- రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న సోమిడి శ్రీనివాస్

వరంగల్‌చౌరస్తా, జూలై 15: రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయడం లేదని రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ అన్నారు. అబ్బనికుంటలోని తెలంగాణ రైతు భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 75 శాతం మందికి ఉపాధిని కల్పిస్తున్న వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. ప్రణాళికాబద్ధమైన, నిర్మాణాత్మక నిర్ణయాలు తీసుకోవడంతో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదన్నారు. దీంతో నేడు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, వాణిజ్య రంగాలు నష్టాలను చవిచూస్తూ మూతపడే స్థితికి చేరుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని లాభాల బాటలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వాలు చొరవచూపి, ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలని, వ్యవసాయ రంగాన్ని ఉపాధిహామీ పథకంలో చేర్చాలని, పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ప్రభుత్వం 75 శాతం సబ్సిడీతో అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ ఆధారిత కుటుంబాలకు ఉచిత విద్య, వైద్యం అందిచాలన్నారు. అందుకనుగుణంగా కమిటీ తీర్మానం చేసి అమలయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు కార్యాచరణ చేపట్టాలని సంఘం సభ్యులకు పిలుపునిచ్చారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు అంశాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, కోశాధికారి సిరుల రవీందర్ పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో సముచిత స్థానం కల్పించాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

వర్ధన్నపేట, జూలై 15: ప్రభుత్వం నియమిస్తున్న నామినేటెడ్ పోస్టుల్లో ముదిరాజ్ కులస్తులకు సముచిత స్థానం కల్పించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, జిల్లా అధ్యక్షుడు చొప్పరి సోమయ్యలు డిమాండ్ చేశారు. ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం వర్ధన్నపేటలో అంబేద్కర్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ విజయ్‌సాగర్‌కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి ఏలోకి మార్చాలని కోరారు. ఉచిత చేప పిల్లలకు బదులు నగదు బదిలీ చేయాలన్నారు. ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. వెయ్యి కోట్లు కేటాయించాలన్నారు.

శ్మశాన వాటికను సందర్శించిన ఎంపీడీవో

'నమస్తే' కథనానికి స్పందన

కార్యదర్శిని వివరాలు అడుగుతున్న ఎంపీడీవో

సంగెం, జూలై 15: మొండ్రాయిలో శ్మశాన వాటికను ఎంపీడీవో రవీందర్ సందర్శించారు. కరెంటు కోసం నిధులు సమకూర్చుకోవాలని కార్యదర్శికి సూచించారు. ఈ నెల 12న ఓ వ్యక్తి దహన సంస్కారాల కోసం శ్మశాన వాటిక వద్దకు గ్రామస్తులు, బంధుమిత్రులు వెళ్లారు. రాత్రి సమయంలో అంత్యక్రియలకు నీరు, కరెంటు సరఫరా లేక పోవడంతో చాలాదూరం వెళ్లి నీళ్లు తెప్పించి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు ఆగ్రహంతో అదే రోజు రాత్రి పంచాయతీ కార్యాలయం వద్ద ఖాళీ క్యాన్లతో ధర్నా నిర్వహించారు. దీంతో ఈ నెల 13న నమస్తే తెలంగాణలో 'శ్మశాన వాటికలో కరెంటు, నీరు లేక ఇక్కట్లు' శీర్షికన కథనం ప్రచురితమైంది. కలెక్టర్ ఆదేశాలతో ఎంపీడీవో సోమవారం మొండ్రాయి శ్మశాన వాటికను సందర్శించి పరిస్థితులను కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. కరెంటు కోసం ప్రతిపాదనలు తయారు చేయాల్సి ఉందని, నీళ్లు ఉన్నప్పటికీ సంబంధిత వ్యక్తి విడుదల చేయలేదని కార్యదర్శి తెలిపారు. ఈ మేరకు కలెక్టర్‌కు నివేదించనున్నట్లు ఎంపీడీవో రవీందర్ తెలిపారు.

19 అడుగులకు చేరుకున్న పాకాల నీటిమట్టం

పాకాల సరస్సు

ఖానాపురం, జూలై 15: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాకాల సరస్సు నీటిమట్టం సోమవారం 19 అడుగులకు చేరింది. పాకాల సరస్సు పూర్తిస్థాయి నీటి మట్టం 30.2 అడుగులు కాగా, యాసంగి పంటకాలం పూర్తయ్యే నాటికి సరస్సులో 15.9 అడుగుల నీరు ఉంది. ఈ సీజన్‌లో కురిసిన వర్షాలకు సరస్సులో 3.3 అడుగుల నీరు చేరింది. పాకాల పూర్తిస్థాయి ఆయకట్టు 29,516 ఎకరాలు. సరస్సులోకి మరో ఐదడుగల నీరు చేరితే వానకాలం సాగుకు ఢోకా ఉండదు. పాకాల ఆయకట్టులో రైతులు ఇప్పటికే నార్లు పోసుకున్నారు. నార్లన్నీ ఏపుగా ఎదుగుతున్నాయి. మరో వారం రోజుల్లో రైతులు నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు.

మొండ్రాయి విద్యార్థికి సిల్వర్ మెడల్

ట్రోఫీతో యోగేశ్వర్

సంగెం, జూలై 15: మొండ్రాయి గ్రామానికి చెందిన తూర్పాటి యోగేశ్వర్ నేపాల్‌లో జరిగిన టార్గెట్‌బాల్ సౌత్ ఏషియన్ టోర్నమెంట్‌లో ప్రతిభచాటి సిల్వర్ మెడల్ సాధించినట్లు విద్యార్థి తండ్రి సురేశ్ సోమవారం తెలిపారు. నేపాల్‌లోని ఖాట్మాండ్‌లో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు టార్గెట్‌బాల్ సౌత్ ఏషియన్ టోర్నమెంట్ జరిగింది. ఇందులో భారత్ తరపున యోగేశ్వర్ పాల్గొని సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా యోగేశ్వర్‌ను గ్రామస్తులు అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

శ్రీనివాస్‌ను అరెస్టు చేసిన పోలీసులు

నిరుద్యోగులకు అండగా ఉంటే తప్పేంటి?

నర్సంపేట, జూలై 15: కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డ్యాగల శ్రీనివాస్ అన్నారు. నర్సంపేటలో సోమవారం శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్టు చేశారు. చలో సెక్రటరీయెట్ ముట్టడి కార్యక్రమానికి మద్దతుగా హైదరాబాద్‌కు వెళ్తున్న శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

దీప్తా మాతగా భద్రకాళీ అమ్మవారు



దీప్తామాతగా దర్శనమిస్తున్న భద్రకాళీ

వరంగల్, జూలై 15: భద్రకాళి శాకాంబరీ నవరాత్రుల మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పదో రోజు సోమవారం అమ్మవారిని ఉదయం దీప్తా మాతాగా అలంకరించారు. షోడష క్రమం అనుసరించి సాయంత్రం కులసుందరీగా అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతా రావు, సహాయ కమిషనర్ రామల సునీత దర్శించుకున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే

వర్ధన్నపేట, జూలై 15: నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు కోరారు. సోమవారం హనుమకొండకు వెళ్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు నాగరాజు తెలిపారు.

పోలీసుల అదుపులో నిందితుడు?

నల్లబెల్లి, జూలై 15: ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న నిందితుడు మడికొండ పోలీసులకు చిక్కినట్లు విశ్వసనీయ సమాచారం. నల్లబెల్లి మండలంలోని రేలకుంట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ములుగు జిల్లా మల్లంపల్లిలోని వాటర్ ప్లాంట్‌లో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో నిందితుడు ఆ వ్యక్తితో పరిచయం పెంచుకున్నాడు. తాను దొంగిలించిన ద్విచక్ర వాహనాలను వాటర్ ప్లాంట్‌లో పని చేస్తున్న వ్యక్తి ద్వారా రేలకుంటలోని పలువురి వద్ద కుదువపెట్టి డబ్బులు తీసుకున్నాడు. ఈ క్రమంలో నిందితుడిని పట్టుకొని విచారిస్తున్న మడికొండ పోలీసులు రేలకుంటకు చేరుకొని పలు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

వృద్ధ దంపతులకు కలెక్టర్ అండ

విచారణ చేపట్టిన కలెక్టర్ సత్య శారద

ఖిలావరంగల్, జూలై 15: కన్న కొడుకులు ఆస్తి విషయంలో తరచూ కొడుతుండడంతో వృద్ధ దంపతులు కలెక్టర్ సత్య శారదకు తమ గోడును వెల్లబోసుకున్నారు. స్పందించిన ఆమె వారికి అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. సంగెం మండలం తీగరాజపల్లికి చెందిన ఇరువాల సమ్మక్క, మల్లయ్య(వృద్ధులు) దంపతులకు చందర్‌రావు, చిరంజీవి అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వారికి పదెకరాల భూమిని సమానంగా పంచారు. ఐదెకరాలను ఆ దంపతులు తమ వద్ద ఉంచుకున్నారు. ఆ భూమిని కూడా తమకు పంచాలని ఇద్దరు కొడుకులు తల్లిదండ్రులను హింసిస్తున్నారు. దీంతో వారు ఇటీవల కలెక్టర్‌ను సంప్రదించగా జిల్లా సంక్షేమ శాఖ అధికారికి సూచనలు చేశారు. దీంతో వృద్ధులను లార్డ్ ఓల్డ్ ఏజ్ హోంకు తరలించారు. అనంతరం మామునూరు ఏసీపీ, పర్వతగిరి సీఐ, సంగెం ఎస్సైతోపాటు దంపతుల కుమారులు, కుమార్తెలను కలెక్టరేట్‌కు పిలిపించారు. ఐదెకరాల భూమిలో రెండెకరాలు ఇద్దరు కూతుళ్లకు, మూడెకరాల భూమిని దంపతుల అనంతరం కుమారులకు చెందేలా తీర్మానం చేయించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★ వరంగల్ హైవేలోని ఆలేరు-కొలనుపాకలో ఓపెన్ ప్లాట్లు మరియు ఫార్మ్‌ల్యాండ్ ప్లాట్లు అమ్మబడును. సాగర్ హైవేలో ఇండస్ట్రియల్ ఏరియాగా అభివృద్ధి చెందుతున్న యాచారంనందు ఓపెన్ ప్లాట్లు కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్ & క్లియర్ టైటిల్. Ph: 7989747927.
NT-325882

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563
9182777618 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777559 MULUGU
9182777135 JANGAON
9182777565 MAHABUBABAD
9182777557

సమావేశంలో మాట్లాడుతున్న మరుపల్ల రవి